"వరాలమ్మగారు ఈ మద్దినే కొనుక్కున్నారు. ఆ సీరెంత బావుందనుకున్నావేటి? అబ్బ....నాన్సెప్పనేననుకో...."

"సెప్పనేపోతే, వల్లకోయే....ఏటో....అంత గొప్పోటి సీర? అది కట్టుకుందుకేనా— నేపోతే పెట్లెట్టి పూస్సెయ్యటానికా? ఏటోలమ్మ అంత గొప్ప సీర?"

# ఎర్రంచు తెల్లచీర

## దేవరాజు రవి

గొప్ప సీరంటే.... గొప్ప దే మరి; తెన్నగా ఎన్న ముద్దగా గుంటాది. దానికుండొలే ఎర్రటంచు....అబ్బ....అదే వెరుపో గానీ, రకతంకూడా దానిముందు ఎల ఎల పోద్ది. ఆ....మరంత ఎరువన్న మాట. దాన్ని- ఏటి- ఆ సిర్ని ముట్టుకుంటేనే నా చెరీరం కితకిత లాడపోద్ది. మరిగలాంటి సీర కట్టుకుంటే, ఇకెల్తై పోతానో...."

"ఆ సిర కట్టుకోనూ వొద్దు.... నువ్వేటీ అయిపోనూ వొద్దుగానీ, మన కెందుకే ఇనాంటి లేనిపోనాశలు? ఏదో పద్దెనిమిది రూపాయలెట్టే ఏ అద్దకం సీరో, ఏ వోయిల్ సీరో కొనుక్కోక మన కిలాంటి ఆశ లేటొసే...."

రంగనాధరావు ఇంట్లో పని చేస్తున్న రంగికి, దాని స్నేహితురాలు లచ్చికి జరిగిన సంభాషణ ఇది.

రంగి పచ్చగా బంగారంలా వుంటుంది.

దాని నుదిటిమీద పాతకానీ అంత ఎర్రటి బొట్టు. బంగారపు నీట్లో- కెంపు పడట్టు మెరిసిపోతూంటుంది. ఎప్పుడోగాని నూనె రాసుకోకపోయినా. అదేం తమాషావో. రోజుకో అంగుళం చొప్పున దాని జుత్తు అలా పెరిగిపోతూనే వుంటుంది. ఇలా మరి కొన్నాళ్ళు ఆగితే, ఏమో చెప్పలేం- పిర్రలుదాటి పిక్కలను స్పృశించవచ్చు ఆ జుత్తు. అదేం నలుపోగాని, అంత నలుపు మరెక్కడా చూడం.

జాకెట్టు వేసుకోవాలనే పెద్ద నియమం ఏమీ లేదు దానికి. ఓసారి వేసుకుంటుంది. మరోసారి వేసుకోదు. వేసుకోనప్పటి కంటె, వేసుకున్నప్పుడే దాన్ని మళ్ళీ మళ్ళీ చూడాలని అనిపిస్తుంది. దాని నిండైన పచ్చని వక్షోజాలు బలంగా జాకెటును చింపుకుని, ఎప్పుడు బయట పడదామా అని పెనుగులాడుతూనే వుంటాయి. ముందుకు ముడి వేసుకుందామంటే కొనలు చాలవు. లాగిలాగి, పిన్ను పెట్టుకుందామంటే, ఆ పిన్ను ఓ పట్టాన పట్టిచావదు?

అది నడుస్తూంటే, తమాషాగా వుంటుంది చూడ్డానికి. అసలే దాని నడుం చాలా సన్నం. అంత సన్నని నడుం, అంతంత బరువైన పిర్రల్ని ఎలా మోస్తుందో, ఎంత ఆలోచించినా ఊహకు అందదు.

మీది బరువుకీ, క్రింది బరువుకీ మధ్య నడుం బాధగా మూలుగుతూవుంటుంది. అయితే మాత్రం అదేం చెయ్యగలదు? తప్పదుకదా దానికి ఈ మోత!?

నాలుగో క్లాసు వరకూ చదువుకుంది రంగి. ఆ తర్వాత వాళ్ళమ్మ దాని చదువు మానిపించేసి, తను పనిచేసే ఇళ్ళకు తనతోపాటు తిప్పేది, ఇప్పట్నించే ట్రెయినింగ్ ఇస్తోందా—అన్నట్టు.

రంగికి తల్లిపోలికలు ఏమీ రాలేదు.

అదే అందరికీ ఆశ్చర్యం కలిగించేది.

"ఇది నిజంగా నీ కూతురేనా? లేక పోతే ఏ బాపన పిల్లనో పెంచుకున్నావా?" అని అడిగేవారు చాలామంది.

"ఆదేటండమ్మగారూ.... అంత మాట సీసినారు. మా కడుపున బేమ్మర్ల పిల్లల్లాంటి పిల్లలు పుట్టకూడ దేటండి? దేవుడిచ్చాడు నా తల్లిని. అది నా వరప్రసాదం" అనేది తన్మయంగా కళ్ళు మూసుకుని. ఏ గతస్మృతులో తలుచుకుంటూ.

"రంగునాది రానేదు కానీండి, దాని పెవాలు సూడండమ్మా....అచ్చం నాయే.... రంగంటే మరి, ఆ బాబు పచ్చగా వుండీ వోరు. ఆ మారాజు రంగే వచ్చింది. ఈ తల్లికి...."

"ఏ బాబే?...." ఏదో క్లూ దొరికినట్టు పాపం తొందరపడి పోయేవారు ఆడంగులు.

రాజమ్మేనా తెలివి తక్కువది?

"ఏ బాబంటారేటమ్మా? దాని బాబు...." అనేది.

"ఎక్కడున్నాడే నీ మొగుడు?" అని అడిగితే-

"ఎక్కడున్నారంటే ఏంసెప్పనమ్మా? ఎక్కడున్నా ఆ బాబేకదా నా దేవుడు...." అంటూ నుదిటిమీద బొట్టు సరిచేసుకునేది.

రంగి వికసించిన మందారంలా తయారయింది. స్టూడెంటు కుర్రాళ్ళు తమ రూంలో పని చెయ్యమంటే, తమరూంలో పని చెయ్యమని, ఒకటే అల్లరి చేసేవారు రంగిని.

అయితే, రాజమ్మ ఒకటే చెప్పింది.

"సూడు రంగీ ఆడదైతే సాలు కొందరు మొగోళ్ళకి, ఆల్లకి సొపర బేదాలుండవ్. అందులో టూడెంట్లయితే మరీ ఇరగబడిపోతారు. ఆ దేవుడు నీకు రూపు రేకలిచ్చాడు. విన్నో మంచి అయ్య సెతిలో ఎడితే. నాకు తృప్తిగా వుంటాది. అలాగ జెనంలాగ నువ్వు సెడిపోకూడదు. అంచేత. నేన్సెప్పేదేటంటే ఎప్పుడూ టూడెంటోళ్ళ దగ్గరకు పని కెళ్ళకు. కుటుమానంతో వుంటారు సూడు, అలాంటోళ్లల్లోనే పని సూసుకోవాల. ఎక్కడయినా, సాలా జాగర్తగా మసులుకోవాలనుకో...." అని ఉద్బోధించింది.

రంగికి, రాజమ్మ మాటలు గురూపదేశంలా తోచాయి. ఇప్పుడు రాజమ్మ పక్షవాతంతో బాధపడుతూంది. ఆ మె బాధ్యత రంగిమీద పడింది.

* * *

రంగనాధరావు ఓ బేంకిలో ఆఫీసరు. అతని భార్య సుజాత- వాళ్ళకి పిల్లలులేరు. ఇల్లు ఆధునికంగా వుంచుకోవడం వారి హాబి.

రంగికి, రంగనాధరావు ఇంట్లో పని చెయ్యడమంటే గొప్ప సరదా. కారణం మరేం లేదు. ఎక్కువగా పని చెయ్య నక్కరలేదు. శ్రమపడి పోనక్కరలేదు. సుజాత చాలా కలుపుగోలు మనిషి. రంగితో అన్ని విషయాలూ మాట్లాడుతుంది. ఇంట్లో చేసే అన్ని వంటకాలూ రుచి చూపిస్తుంది. రంగంటే ఆమెకు విపరీతమైన నమ్మకం కూడాను. ఇల్లు ఎలా

చిటుకులు :

## తీర్థంకర నిషాదయోగము



అతనిది 'మద్యే' మార్గం అన్నిట్లో
అందుకే కనబడతాడు "షాపు"లన్నిట్లో
అతడు మాట్లాడతాడు ఎంతో "రంమ త్తు"గా
జీవితాన్ని "స్కాచి" వడబోసిన వ త్తుగా
అతడు సదా "బిందించిన" "నిషా" ద 'బీరు'వు
"జగమంతా భ్రాంది" అన్న "తీర్థం"కర మేరువు
అతడు అదేపనిగా పాడగా "తూజానాదూ"
అయింది "కేరాఫ్ బజారు"—అతని పెళ్ళాం పిల్లల చిరునామా

—భండారం పర్వతాలరావు

---

పడితే అలా వదిలేసి ఎక్కడికైనా వెళ్ళిపో తుంది.

అయితే, వీటన్నిటి కన్నా సుజాత కట్టుకునే చీరలంటే రంగికి వెర్రి ఇష్టం. ఆమెకు మంచి మంచి ఫేషన్లు తెలుసు. బీరువానిండా చీరలే. ఒక్కొక్క చీరా చూస్తూంటే. రంగి మనసు ఆనందంతో పురకలు వేస్తుంది.

"బతికితే ఇనా బతకాలి. ఇనాంటి సీర్లు కట్టుకోవాలి. ఆయమ్మెంత పెట్టిపుట్టిందో." అనుకుంటుంది సర్ఫులో సుజాత చీరలు వుతుకుతున్నప్పుడు.

బాత్ రూమ్‌లో కూర్చుని చీరలు తడుపు తున్నప్పుడు దాని మనసుకు రకరకాల ఆలోచనలు వచ్చేవి. ఆ ఆలోచనలతో నిలవలేకపోయేది. ఆ చీరలు కట్టుకోవాలనే తపన దానికి దినదిన ప్రవర్ధమానమైంది.

ఆవేళ బాత్‌రూమ్‌లోనే ఏదో ఒక చీర కట్టుకు తీరాలనే నిశ్చయానికి వచ్చింది రంగి. అయితే ఎలా? చీరలన్నీ బాల్చీలో తడిసి వున్నాయి. అమ్మగారు ఇంటోనే వున్నారు. కానీ, సుజాత పూజా మందిరంలో వుంది. అంటే ఓ అరగంట వరకూ బయటకు రాదన్న మాట.

ఏవో పద్యాలూ, శ్లోకాలూ వినిపిస్తున్నాయి.

ఇదే మంచి సమయం అనుకుని, బాత్ రూంలో తలుపులు లోన గడియ పెట్టుకుంది. లైటు వేసుకుంది. తను కట్టుకున్న చీర. వాటి ముందు గోనెలా అనిపించింది.

"ఛీ-" అనుకుని, నిస్సంకోచంగా ఇప్పేసి దండెం మీద పడేసింది. జాకెట్టు ఎలాగూ లేదు.

వచ్చగా మిస మిస లాడుతున్న తన శరీరం, అందులో వంపులు - నగ్నంగా తనని తాను చూసుకునే సరికి ఏదో మైకం కలిగినట్టనిపించింది రంగికి.

ఇటు చూపే సరికి ఎదురుగా తన రూపం అపూర్వంగా కనిపించేసరికి, బిత్తరపోయింది.

ఆ బాత్‌రూంలో ఓ నిలువెత్తున అద్దం కూడా వుంది. అలా అద్దం వుందనే సంగతి తనకు చాలా రోజుల నుంచీ తెలిసినా, ఇలా తన నగ్నరూపాన్ని ఎదురుగా చూసుకున్నప్పుడుగాని ఆ అద్దం విలువ దానికి తెలిసి రాలేదు.

అబ్బ! తనెంత అందంగా వుంటుంది!

నిజం చెప్పొద్దూ! తన అందం అదేదో కథల్లో చెప్తారే, దేవకన్యలు అచ్చు వాళ్ళ అందంలావుంది. ఎక్కడి కక్కడ ఏపుగా, పుష్టిగా ఎదిగిన శరీర భాగాలు.

సిగ్గేసింది రంగికి. తనను తాను అద్దంలో చూసుకోవడానికి.

అయితే అలా చూసుకోవడంలో తృప్తో!! దాన్ని అధిగమించడం అదెవరి తరం?

అద్దం దగ్గరగా వెళ్ళి తన ప్రతిబింబాన్ని తనివితీరా ముద్దు పెట్టుకుంది.

తడి చీర కట్టుకుంటూంటే, ఆ చల్లని స్పర్శకి శరీరంలో ఏదో పులకింత! ఓ గొప్ప అనుభూతి! తనకు తెలియని కోర్కెలు ఒక్కసారిగా తీరితే ఎంత బావుంటుంది, అని అనిపించే ఓ మధుర భావన!

చీర కట్టుకుంది. పలుచని ఆ ఖరీదైన చీరలోంచి దొంగతనంగా చూసే నిండైన రొమ్ములు, బలమైన తొడలు, అప్పడంలా అంటుకుపోయిన కడుపు..

"అబ్బ. ఇంత సరదాగా నా కెప్పుడూ నేదే" అనుకుంది.

తదేకంగా అద్దంలో తన ముఖంకేసీ, కట్టుకున్న చీరకేసి తృప్తి తీరా చూసుకుంది రంగి.

"రంగీ....ఇంకా ఏం చేస్తున్నావే? చీరలు తడపడం అయిపోయిందా? రా. ప్రసాదం తిందువుగాని...." అని గట్టిగా పిల్చిన సుజాత పిలుపుకి బాహ్యలోకంలోకి వచ్చిపడింది రంగి.

ఆప్యాయంగా ఆ చీర విప్పేసి, అయిష్టంగా తన ముతక చీర కట్టుకుంది.

* *

బాత్ రూంలో తను పొందిన ఈ అనుభూతిని వదులుకో దల్చుకోలేదు రంగి.

వారానికి రెండు రోజులు సుజాత చీరలు తడిపి ఆరెయ్యాలి. ఆ రోజుల్లో తనకు నచ్చిన చీరలు బాత్‌రూంలో కట్టుకుని, అద్దంలో తన అందాన్ని ఇష్టంగా చూసుకోవడం అలవాటయిపోయింది రంగికి.

మనిషికి కోర్కెలు కలగకనే పోవాలి. కలిగాక వాటికి అంతూ దరీ వుండదు. అవి అలా ఆకాశమంత ఎత్తు పెరిగిపోతూనే వుంటాయి. అవి అలభ్యమయిన వయినా, అసహజమయిన వయినా, అత్యంత సహజంగానూ, అనుభవించి తీరవలసినంత ముఖ్యమైనవిగానూ కనిపిస్తాయి.

ఇలా తన చీరల సరదా బాత్‌రూంవరకు మాత్రమే పరిమితం చెయ్యడం ఏం నచ్చలేదు రంగికి.

నచ్చలేదు గానీ, అంతకుమించి తానేం చెయ్యగలదు?


రకరకాల చీరలు కట్టుకున్నా, ఈ మధ్యనే సుజాత కొన్న ఎర్రంచు తెల్లచీర మీద తీరని మమకారం పెంచుకుంది రంగి.

కానీ, అది కట్టుకునే అవకాశమే కుదరడంలేదు. ఒక్కసారి మాత్రమే కట్టుకుని సుజాత మడతపెట్టి బీరువాలో దాచేసింది ఆ చీరని. ఇగో, మళ్ళా నిన్న కాబోలు ఆ చీర తీసి కట్టుకుని, మహిళా మండలికి వెళ్ళివచ్చింది.

"రంగీ...."

".... అమ్మా...."

"నేను అర్జంటుగా వైజాగెల్తున్నాను. రెండ్రోజుల్లో వచ్చేస్తాను. అయ్యగారు సాయంత్రం ఆఫీసునుంచి వచ్చాక, వచ్చి కనబడు. వన్లుంటే చేసి వెళ్దువుగాని. ఇగో ఈ చీరెలు కాస్త తడిపి ఆరేసి వెళ్ళిపో. సాయంత్రం అయిదుకి మాత్రం తప్పకుండా వచ్చి వెళ్ళు," అంది సుజాత బయలుదేరుతూ.



చీరలవేపు చూసింది రంగి. అందులో తన కిష్టమైన ఎర్రంచు తెల్లచీర! దానికి కలిగిన ఆనందం అంతా ఇంతా కాదు.

ఇంట్లో ఎవరూ లేరు. నిశ్శబ్దంగా వుంది. ఆదరా బాదరా ఆ చీర కట్టేసు కుందా మనుకుంది. విప్పి చూస్తే దానిమీద కాస్త కాఫీ వొలికినట్టుంది. మనసు చిన్నబుచ్చుకుని, "తడిపి ఆరిన తర్వాత కట్టుకోవచ్చులే- ఎందుకొచ్చిన తొందర? సాయంత్రం ఎంచక్కా కట్టుకుంటే బావుంటుంది కూడా...." అనుకుని ఆ చీరల్ని తడిపి ఆరేసింది.

ఇంతలో ఫోన్ గణగణ మంది.

రంగికి భయంవేసింది. ఇంతకుముందు అనేకసార్లు ఫోనందుకుని, హలో అనడం జరిగినా, వెంటనే వచ్చి సుజాత అందుకునేది. ఇప్పుడలా కాదు. ఇంట్లో ఎవరూ లేరు. ఎవరు ఫోన్ చేశారో? ఏం మాట్లాడాలో??

చిరుచెమట లాంటిది కమ్మింది. మెల్లగా ఫోనెత్తింది.

"ఎవరూ...."

".... .... ...."

"ఆ. అయ్యగారాండి. నేనండీ రంగిని! అమ్మగారాండి- ఎళిపోయారండి.... ఏటండీ.... ఆ.... ఇప్పుడేనండీ...."

".... .... .... ...."

"ఆలగేనండి.. తమరొచ్చేసరికి వొచ్చిస్తానండి.. అయిదుక్కడుండయ్యగోరూ.. అలగేనండీ.. ఏటండి కాఫీ అండి.. అలగేనండి..పేసి ఫాస్కులో పోస్తనండి.... అలగేనండి...."

ఈ రెండు ముక్కలకే అలిసిపోయింది రంగి.

"అయ్యబాబోయ్ ........ అయ్యగార్తో ఫోన్లో మాట్టాణ్ణమే .... ఏదైతేనేం.... మాటాడీసినాను." అనుకుంది గర్వంగా.

సుజాతా, రంగనాధాలు పడుకునే ఫోమ్ బెడ్‌మీద దుప్పటి దులిపి, సరిచేసింది. తలగడలు ఓ సారి తీసివేసింది.

"అబ్బ. ఎంత మెత్తగున్నై. కూకుంటే కిందకి దిగిపోయేట్టుంది మంచం, పరుపూను. ఎంత సుకంగుంటాదో దీని మీన తొంగుంటే." అనుకుంది.

ఆ అనుకోవడం అక్కడితో ఆగలేదు. ఆ క్రియకై తొందర చేసింది మనసు.

ఇంట్లో ఎవరూ లేరని తెలిసినా ఇటూ, అటూ చూసింది. ఎదురుగావున్న ఏడుకొండలవాడి పటానికి నమస్కరించి, మెల్లగా మంచంమీద కూర్చుంది.

చెయ్యకూడని పనేదో చేస్తున్నట్టు బుద్ధి గ్రహిస్తూనేవుంది. మనసు, శరీరం మాత్రం ఆ కోరికను అధిగమించలేక పోయాయి.

వెల్లకిలా ఆ మంచంమీద పడుకుంది రంగి. గుండెలు వేగంగా కొట్టుకోసాగేయి. పమిటదారితప్పింది. యౌవ్వనం దోబూచులాడుతోంది. మైకంగా కళ్ళుమూసుకుంది!

ఏదో స్వాప్నిక లోకంలో విహరిస్తున్నట్లు అనుభూతి. మగత చిన్న నిద్ర. నిశ్చలంగా, నిర్మలంగా గడచింది కాలం,

మెలకువ వచ్చేసరికి రెండు దాటింది. గాభరాగా లేచి, తను చేసిన పనికి కాస్త భయపడి, సిగ్గుపడి- తర్వాత ఇలాంటి అనుభూతిని పొందినందుకు తృప్తిపడి, మంచం దిగింది. పక్క సరిచేసింది.

బాత్‌రూంలోకి వెళ్ళి ముఖం, కాళ్ళూ, చేతులూ కడుక్కుని వస్తూ చీరలు ఆరిపోయాయేమో చూసింది. ఇంకా ఫాల్ దగ్గర కాస్త తడిగా వుండడం వల్ల తియ్యకుండా వుంచేసింది,

ఇంటికి తాళం వేసి, తన ఇంటికి నడిచింది రంగి.

* * *

"ఎక్కడుండి పోనావే ఇంచేపు.. తిండి తిప్పలక్కర్నేదేటి...." మంచం మీంచి లేవలేక సతమతమౌతూ అడిగింది రాజమ్మ.

"బేంకమ్మగారు ఊరెళ్ళారు. అయ్యగారు ఆఫీసెళ్ళారు. ఇంట్లో పన్లు సూసుకొచ్చేసరికి ఈ ఏళైంది. మళ్ళీ అయిదింటికి ఎల్లాల....బాబొచ్చే టైంకి" అంటూ, సిల్వరు కంచంలో అన్నం తరవాణి వంపుకుని వుల్లిపాయొకటి వేసుకుంది.

ఏంతిందో ఏం లోకమో- దానికి ఒకటే ఆతృత. ఎంత తొందరగా వెళ్తాను. అయ్యగారు రాకుండా. ఎంత తొందరగా ఆ ఎర్రంచు తెల్ల చీరకట్టుకుంటాను!-అని.

దాని తొందరకు తగ్గట్టుగానే, రాజమ్మకు కాస్త సేవలు చెయ్యాదల్చి వచ్చింది కూడా. తడి గుడ్డతో దాని శరీరం తుడిచి, కసింత తరవాణి పెట్టింది.

ఇంతలో ఒకటీ ఒకటీ ఏ మూలనుంచి వచ్చాయో మబ్బులు మెల్లగా ఆకాశమంతా నిండి పోయాయి. ఉన్నట్టుండి పెద్ద వర్షం ప్రారంభమయింది.

రంగికి ఛట్టున జ్ఞాపకానికి వచ్చింది. తాను ఆరేసిన చీరలు తియ్యలేదని! అంత వర్షంలోనూ పరిగెత్తాలని బయలుదేరింది.

కానీ రాజమ్మా, పక్కింటి పార్వతీ దాన్ని కదలనివ్వలేదు.

రంగి మనసు చీరల చుట్టూ తిరుగుతోంది. కాఫీ చెయ్యమన్నారు. చెయ్యలేదు. అతనొచ్చేసరికి లేకపోతే ఏమంటాడో?

"పాడోన.. పాడోనా-ని" అనుకుంది కసిగా మనసులో.

"తాళాల్నా దగ్గరుండి పోనాయి. అయ్యగారొస్తే ఎనాగా.. నానెళ్తాను...." అంది మొండిగా.

"ఓ వెర్రిముకమా! తాళాల్నీ దెగ్గిరుండి పోతే, ఆరెలా ఎల్తారనుకుంటున్నావా? ఆరికాడ డూప్లికేటీ వుంటాదే.. బెంగెట్టీసుకోకు...." అంది పార్వతి.

ఎలా అయితేనేం, వర్షం కాస్త తెరిపి ఇచ్చింది. సన్నగా చినుకులు పడుతూనే వున్నాయి. పరుగులాంటి నడకతో రంగనాధరావు ఇల్లు చేరుకుంది రంగి,

తలుపులు తాళాలు తీసున్నాయి. దాని గుండె గుభేలుమంది,

"అయ్యగారొచ్చీసుండాల. ఇయేల

ఆంధ్రజ్యోతి సచిత్ర వారపత్రిక

అభిమానులు, ఏజెంట్లు, ప్రకటన కర్తలు, రచయిత్రులు, రచయితలు, కవులు, చిత్రకారులు, కార్టూనిస్టులు, పాఠకులకు

మా పింగళ దీపావళి శుభాకాంక్షలు!

తిట్లు తప్పవ్....అనుకుంటూ మెల్లిగా తలుపు తట్టింది.

తలుపులు తెరుచుకున్నాయి.

"అరే....అదేమిటలా తడిసిపోయావ్‌? రా. రా....లోపలికి రా...." అన్నాడు రంగనాథదావు.

రంగి లోపలికి వెళ్ళింది.

రంగనాథం ఓ తువాలుతీసి, రంగి మీదకు విసిరాడు తుడుచుకోమని।

"ఏమ్లేదండయ్యగోరూ.... పర్లేదు...." అంది భయం భయంగా.

"బలేదానివే .... తడిసి ముద్దయి పోయావ్. తుడుచుకో...." అన్నాడు.

రంగి తువాల్తో తల, శరీరం తుడుచుకుంది.

కట్టుకున్న చీర తడిసి శరీరానికి అతుక్కుపోయింది. రంగికి సిగ్గువేసింది. అక్కడ నిలబడలేకపోయింది.

"చీరకూడా బాగా తడిసిపోయినట్టుంది. ఇదుగో ఈ చీర కట్టుకో....'' అంటూ రంగనాథం ఓ చీర రంగి మీదకు విసిరాడు.

ఆశ్చర్యపోయింది రంగి. అది ఎర్రంచు తెల్ల చీర ।।

ఆమె చిరకాల వాంఛితం ఏన్నాళ్ళ గానో గూడుకట్టు... కోర్కె ఈ ఎర్రంచు తెల్లచీర.

అంతే, అయ్యగారు వర్షానికి ముందుగానే వచ్చి, ఆరేసిన చీరలు తీసేశారన్న మాట।

అది సరే।

నాకు ఇష్టమైన ఈ చీరే అయ్యగారు నన్ను కట్టుకోమని ఇవ్వడం ఎంత ఆశ్చర్యం।

ఆ చీర స్పర్శకు పులకించిపోయింది రంగి.

కానీ, ఎలా కట్టుకోవడం? అయ్యగారు కట్టుకోమనగానే కట్టేసుకోవడమేనా?- ఆలోచనల్లో పడింది రంగి.

"ఏమిటాలోచిస్తున్నావ్? పొడి చీర కట్టుకో...." అన్నాడు రంగనాథం.

మారు మాటాడకుండా, వంటగదిలోకి వెళ్ళి చీర మార్చుకుంది. తన ముతక చీర పిండి, వరండాలో ఆరేసింది.

రంగనాథం కాఫీ చేసుకుని తాగేసినట్టున్నాడు. ఖాళీ గ్లాసులు వున్నాయి.

"ఎంత పనై పోయింది.... అయ్యగారేమనుకున్నారో ఏటో...." అనుకుంది బాధగా.

పొడవైన నల్లటిజుత్తులో ఇరుక్కున్న నీటి ముత్యాలను బలంగా నేల రాలుస్తూ, పెద్ద కొప్పుముడి వేసుకుంది.

పచ్చని బంగారు శరీరంమీద ఎర్రంచు ద్విగుణీకృతమైన అందంతో వెలిసిపోతూంది. పాల మీగడలాంటి తెల్లనిచీర. రంగి వంపుసొంపుల్ని దాచలేక సతమతమౌతూంది.

ఈ దృశ్యాన్ని చూసిన రంగనాథం చలించాడు.

సుజాత అనాకారికాదు. కానీ ఈ చీర నిజమైన సొగసు చూపింది, రంగి కట్టుకున్నప్పుడే।

అతని ఆలోచనలు పురి విప్పాయి।

సభ్యత, సంస్కారం అడ్డు వచ్చాయి. అయినా, అతనిలో కోర్కెలకు రూపకల్పన జరుగుతోంది.

అయినా తొందరపడలేదు.

"రంగీ....నేనలా పిధిలోకి వెళ్ళొస్తాను కొత్త బియ్యం కడిగి స్టౌమీద పెట్టేయ్.


ప్రత్యేక శీర్షికలు

శ్రీశ్రీ పదబంధ ప్రహేళిక - ఇది మీ మెదడుకు మేత

(ప్రహేళికా విజేతలకు రు.50/- బహుమతి ఉంది)

మీ ప్రశ్నకు మా జవాబు } విఖ్యాత రచయిత ధనికొండ హనుమంతరావు

మా ప్రశ్నకు మీ జవాబు } నిర్వహిస్తున్న విశేష శీర్షిక

(ఉత్తమ ప్రశ్నకు రు.25/- ఉత్తమ జవాబుకు రు.25/- బహుమతులు)

కబుర్లు - హాస్యం, వ్యంగ్యం మేళవించి మిమ్మల్నలరించే కబుర్లు— చలసాని ప్రసాదరావు కబుర్లు

మయసభ (నవంబర్ సంచికతో ప్రారంభం) రాజకీయం, అరాజకీయం. రాజకీయాలే కాక సాహిత్యం, సాంఘికం... ఎన్నో విషయాలపై వినోద భరిత వ్యాఖ్యానం ... ఏ.రామసందేవి

సీరియల్స్
- భూమి గుండ్రంగా వుంది - బీనాదేవి (సారీ! ఈ సీరియల్ 'పుణ్యభూమీ కాసేపు కళ్ళు తెరువు' పేరుతో ప్రారంభమయింది. ఈ నెలనుంచే పేరు మారింది)
- మనిషికెంకావాలి : కొమ్మూరి వేణుగోపాలరావు


నవంబర్ సంచిక నుంచి చిన్న సీరియల్ ప్రారంభం....

చెట్టూ-ఛాయా... ఆరెకపూడి (కోడూరి) కౌసల్యాదేవి

ఇంకా— మీరు మెచ్చే మంచి కథలూ, కార్టూన్లూ అన్నిటినీ మించి— రంగుల ముఖచిత్రాలంకరణలతో నెలనెలా పూర్తి నవల

సచిత్ర మాస పత్రిక

తెలుగు పాఠకుల తొలి ఎన్నిక!



అలంకరణ శిల్ప

—బిర్. ఉదయభాస్కర్, తెనాలి

నేను వచ్చాక నువ్వు వెళ్ళిపోదువుగాని." అంటూ డ్రెస్ ఛేంజి చేసుకుని స్కూటర్ తీసుకుని బయలు దేరాడు.

రంగికి ఇప్పుడు ఫ్రీగా వుంది.

తన మనసులో కోర్కె ఇన్నాళ్ళకు తీరింది. దొంగతనంగా. తను ఎన్నోసార్లు సుజాత చీరలు కట్టుకుంది. ప్రత్యక్షంగా బాత్ రూంలో ఆ అందాన్ని చూసుకుంది.

అందువల్ల కలిగిన తృప్తికన్న, తాను చిరకాలంగా కోరుకున్న ఎర్రంచు తెల్ల చీర, అయ్యగారు స్వయంగా ఇవ్వగా. తాను కట్టుకుని, ఆ బాబు ఎదురుగా తిరగడం- నిజంగా ఇది గొప్ప అదృష్టం... అనుకుంది.

ఆమె మనసు గాలిలో తేలిపోతూంది. ఆ చీర కట్టుకుని, ఆ ఇంట్లో తిరుగుతూ వుంటే, తానే ఆ ఇంటి యజమానురాలైనట్టు- అనిపించింది రంగికి.

స్టౌవ్ మీద బియ్యం పడేసి. కాఫీ గళాసులు కడిగేసి. బెడ్ రూంలోకి వచ్చింది. డ్రెస్సింగ్ టేబిల్ మీదున్న అద్దంలో తనని తాను చూసుని-

"అమ్మగారికంటే నేనే అచ్చరెట్లు బావుంటాను...." అనుకుంది.

గదిలో ఫేను వేసుకుంది. బైట చల్లని వాతావరణానికి తోడు, లోపల ఫేనుగాలి ఓ వింత చలిని కలిగించింది రంగిలో;

రకరకాల కోర్కెలు ఊహల కంద కుండా పరుగులు తీయసాగాయి,

ఓ పావుగంటలో వంటింటి పని పూర్తి చేసుకుని అన్నం దించేసింది. రంగనాధం వెళ్ళి గంటపైన అయింది. మధ్యాహ్నమయితే దర్జాగా మంచం మీద పడుకుంది కానీ, ఇప్పుడా ధైర్యం లేదు.

మంచాని కాసుకుని, కళ్ళు మూసుకుని ఏవేవో తీయతియ్యగా ఆలోచించుకోనాగింది-అలా చిన్న కునుకు పట్టేసింది.

ఎవరో తనని బలవంతంగా దగ్గరకు లాక్కుంటున్నట్టనిపించి. కళ్ళు తెరిచింది రంగి.

తనని వాటేసుకుని, తన పెదాల్ని గట్టిగాముద్దు పెట్టెకుంటున్న అయ్యగారు;

అతని శ్వాస నుంచి వెలువడుతున్న బ్రాందీ వాసన;

రంగి నిద్ర చెదిరి పోయింది. భయంతో కర్రకట్టుకుపోయింది. లేవ బోయింది. రంగనాధం లేవనియ్యలేదు.

"రంగీ ...ప్లీజ్...." అంటూ ఆమెను బలంగా లేవనెత్తి. మంచంమీద పడేశాడు.

ఆ చీరలో. ఆ గదిలో, ఆ మంచంమీద ఏవేవో వూహించుకున్న రంగి, ఆ వాస్తవాన్ని ఆహ్వానించలేకపోయింది; తట్టుకోలేకపోయింది;

"అయ్యగారూ.... వదలండి....నన్నొదలండి ... నే వెళ్ళిపోతాను...." అంటూ పెనుగులాడింది.

రంగనాధం తన పట్టు సడలించలేదు. తెల్లనైన ఆమె పవిత్రత. ఎర్రగా గాయపడిందా అన్నట్టు, చీర శరీరంమీద అస్తవ్యస్తమయింది. ఆమె బలమైన. నిండైన రొమ్ములు, రంగనాధాన్ని వెర్రెత్తించాయి.

"రంగీ నీక్కావల్సినంత డబ్బిస్తాను, కాదనకు.... ప్లీజ్.... నువ్వు నాక్కావాలి. ప్లీజ్.... ప్లీజ్...." అంటూ జేబులో పర్సు తీసి. నోట్లు ఆమె చేతిలో గుప్పించబోయాడు.

ఆ పర్సులో ఆమె ఒక ఫొటో చూసింది. ఆశ్చర్యపోయింది.

తన పరిస్థితేమిటో మరిచిపోయి.

"అయ్యగారూ....ఆఫొటో ఎవరిదయ్యగారూ...." అడిగింది.

"ఛెస్....అదెవరిదయితే నీ కెందుకే.... అది మా నాన్నది— ఇప్పుడులేడు.... చచ్చిపోయాడు....ఇంద.... ఈ డబ్బంతా నీదే కమాన్...."అంటూ ఆమెమీద బలంగా పడబోయాడు రంగనాధం.

రంగి ఆలోచనలు ఆగిపోయాయి.

ఆమె ఒక నిశ్చలస్థితికి వచ్చింది.

అతనిచేతిలో పర్సు అందుకుని, మంచం మీంచి ఒక్కసారి కిందకి లంఘించి జారిపోతున్న - వూడిపోతున్న చీరను సరిచేసుకుంటూ, వీధిలోకి పరుగు తీసింది.

ఆమె తన ఇంటివేపు పరిగెడుతోంది.

ఆమె తలలో ఒక్కటే ఆలోచన;

"ఇది మా అయ్య ఫొటోలావుందే" ★